# విద్యుత్తు కొనుగోలుపై సర్కారు మౌనం

- ఎన్టీపీసీతో గడువు ముగిసినా స్పందన నిల్
- ఇతర రాష్ట్రాలకు అమ్మేందుకు సన్నాహాలు
- రెండో దశకు కేంద్రం గ్రీన్ సిగ్నల్
- ఆర్టీఐ ద్వారా వెల్లడించిన ఎన్టీపీసీ



హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర పునర్విభజన చట్టంలో భాగంగా చేపట్టనున్న ఎన్టీపీసీ రెండోదశ ప్రాజెక్టు నుంచి విద్యుత్తు కొనుగోలు విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎటూ తేల్చడంలేదు. 2400 (3x800) మెగావాట్ల విద్యుత్తుకు సంబంధించి ప్రభుత్వం పీపీఏ (పవర్ పర్చేజ్ ఎగ్రిమెంట్) చేసుకుంటే వెంటనే ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపడతామని ఎన్టీపీసీ పదేపదే లేఖలు రాస్తున్నా రాష్ట్ర సర్కారు నుంచి స్పందన రావడంలేదు. దీంతో ఎన్టీపీసీ గత ఫిబ్రవరి 10వ తేదీలోగా ఏదో ఒకటి తేల్చాలని గడువుగా నిర్ణయించింది. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు స్పందించలేదు. దీంతో ఎన్టీపీసీ ఇతర రాష్ట్రాలకు విద్యుత్తును విక్రయించేందుకు సన్నాహాలు చేస్తున్నది. ఈ మేరకు సీనియర్ పాత్రికేయుడు ఇనగంటి రవికుమార్ సమాచార హక్కు చట్టం ద్వారా ఎన్టీపీసీ నుంచి సేకరించిన వివరాలను వెల్లడించారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం.. తెలంగాణ భవిష్యత్తు అవసరాల కోసం ఎన్టీపీసీ ద్వారా 4000 మెగావాట్ల థర్మల్ ప్రాజెక్టును ఏర్పాటుచేసి అందులో 85 శాతం విద్యుత్తును రాష్ట్ర అవసరాలకు కేటాయించాలి. మొదటిదశలో 1600 (2x800)మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి ప్రాజెక్టు పూర్తికావడంతో ఇటీవలే దాన్ని ప్రధాని మోదీ జాతికి అంకితం చేశారు. రెండోదశ ప్రాజెక్టు కోసం ఫీజిబులిటీ రిపోర్టుకు కేంద్రం ఇదివరకే ఆమోదం తెలపగా, శక్తి పథకం కింద సింగరేణి ద్వారా కోల్ లింకేజీకి స్టాండింగ్ లింకేజీ కమిటీ(లాంగ్ టర్మ్) ఆమోదం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు కొనుగోలుకు ఒప్పందం చేసుకుంటే ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి. ఈ నేపథ్యంలో అక్టోబర్ 2023 నుంచి ఈ ఏడాది జనవరి 29వ తేదీ వరకు పీపీఏ కోసం ఎన్టీపీసీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి మూడు లేఖలు రాసింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదు. జనవరి 29న తెలంగాణకు ఎన్టీపీసీ చివరి లేఖ రాస్తూ, ఫిబ్రవరి 10వ తేదీలోగా స్పందించకపోతే ఇతర రాష్ట్రాలతో ఒప్పందం చేసుకుంటామని స్పష్టంచేసింది. దీనిపై ప్రభుత్వం స్పందిస్తూ... ఫిబ్రవరి చివరికల్లా ఒప్పందం చేసుకుంటామని తెలిపింది. అయినా ఈ నెల 20 వరకూ పీపీఏకు ముందుకు రాలేదు. దీంతో చేసేదిలేక ఎన్టీపీసీ ఇతర రాష్ట్రాలకు ఆఫర్ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తున్నది.



## యాదగిరిగుట్టలో బ్రహ్మోత్సవాలు పరిపూర్ణం

*యాదగిరిగుట్ట* లక్ష్మీనరసింహ స్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు గురువారం పరిపూర్ణమయ్యాయి. ఉదయం విశ్వక్సేన, పుణ్యాహవచనం, హవన పూజలు చేసి పూర్ణాహుతి జరిపారు. లక్ష్మీనరసింహస్వామిని 108 కలశాలతో వేదమంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ అభిషేకించారు. గర్భాలయంలోని స్వయంభూమూర్తులు, సువర్ణ ప్రతిష్ఠామూర్తులకు అష్టోత్తర శత కలశాలతో అభిషేక పూజలు వైభవంగా నిర్వహించారు. రాత్రి కల్యాణమూర్తులు లక్ష్మీనరసింహస్వామిని పట్టుపీతంబరాలు, ముత్యాలు, రత్నాల ఆభరణాలు, వివిధ రకాల పూలతో దివ్యమనోహరంగా అలంకరించి డోలికలో అధిష్ఠింపజేశారు.

– యాదగిరిగుట్ట



జనగామ ఎంసీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

## పెంబర్తి గురుకులంలో ఫుడ్ పాయిజన్

- ఎనిమిది మంది విద్యార్థినులకు అస్వస్థత

జనగామ రూరల్, మార్చి 21 : జనగామ జిల్లా కేంద్రం సమీపంలోని పెంబర్తి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం ఎనిమిది మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. సాయంత్రం సుమారు 600 మంది విద్యార్థినులు వంకాయ, సాంబారు, పెరుగుతో భోజనం చేశారు. అందులో ఐదుగురికి వాంతులు కావడంతోపాటు కడుపు నొప్పితో బాధపడుతుండటంతో సుమారు 7:30 గంటలకు జనగామలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ఇంతలోనే మరో ముగ్గురికి కూడా అలాగే కావడంతో వారిని పసరమడ్ల మాతాశిశు దవాఖానకు తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం కొంత నిలకడగా ఉన్నట్టు తెలిపారు. ఆహారం కలుషితం కావడంతోనే ఇలా జరిగిందని పేర్కొన్నారు.








